క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు మంత్రికి ఆహ్వానం


మంత్రికి ఆహ్వానపత్రిక అందిస్తున్న నాయకులు

ధర్మపురి: గోదావరి ఒడ్డునున్న విశ్వకర్మ భగవానుని ఆలయంలో ఈనెల 15నుంచి 17 వరకు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు రావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆహ్వానపత్రిక అందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విశ్వకర్మ సంఘం నాయకులు శనివారం కలిసి ఆహ్వానించారు.

దుర్గ నవరాత్రోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

పట్టణంలో నవదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించే దుర్గమాత నవరాత్రోత్సవాల కరపత్రాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆవిష్కరించారు.

గ్రామ సమస్యలు తీర్చాలని వినతి


విప్ ఆది శ్రీనివాస్‌తో కాచారం గ్రామస్తులు

మేడిపల్లి: మండలంలోని కాచారంలో పలు సమస్యలను వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. వేములవాడ క్యాంపు కార్యాలయంలో శనివారం గ్రామస్తులు కలిసి పలు సమస్యలపై విన్నవించారు. జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నప్పటికీ కాచారం ప్రధాన చెరువు ఇప్పటికీ నిండలేదని, వరద కాలువ నుంచి నింపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో ప్రధాన రహదారులు అధ్వానంగా తయరయ్యాయని, విద్యుత్, ధాన్యం కొనుగోలు కేంద్రం స్థలం, ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వివరించారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి, కొప్పెరా లింగారెడ్డి, భూమరెడ్డి, దేశెట్టి గంగారాజం, రాజేశ్ పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో కార్పం చిత్రం యూనిట్ పూజలు


అంజన్న సన్నిధిలో స్క్రిప్ట్‌కు పూజ చేయిస్తున్న నటీనటులు

మల్యాల: శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామిని కార్పం చిత్రం యూనిట్ దర్శించుకుని, స్క్రిప్ట్‌తో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దర్శకుడు రాకేశ్‌రెడ్డి, కార్పం చిత్రం నిర్మాతలు భాను చందర్; వెంకట ప్రసాద్, చిత్రంలో ముఖ్య నటీనటులు భాను, దక్షిటునీష, రవీంద్ర రెడ్డి, తిరుపతి, డింపుల్ మౌనిక పాల్గొన్నారు.

సినీ కమెడియన్ పూజలు

కొండగట్టు ఆంజనేయస్వామిని సినీ కమెడియన్ రాజేశ్ దర్శించుకుని, స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ, ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు.

వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్

జగిత్యాల: వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చని ఐఎంఏ పట్టణ అధ్యక్షుడు హేమంత్ అన్నారు. శనివారం ఐఎంఏ హాల్‌లో సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్‌పీవీ వ్యాక్సిన్ ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, ప్రతి మహిళ ఈ వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా క్యాన్సర్ నివారణకు తోడ్పడుతుందన్నారు. గైనకాలజీ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్‌శ్రీలత మాట్లాడుతూ, దేశంలో క్యాన్సర్ మరణాలు పెరుగుతున్నాయని, సర్వైకల్ క్యాన్సర్ నివారణకు ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. 59 మంది మహిళలకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సుధీర్‌కుమార్, ఒడ్నాల రజిత, స్వరూప పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

రాయికల్: పట్టణంలోని సంఘమిత్ర శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే దుర్గశరన్నవరాత్రోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం యువజన, మహిళా సంఘాల సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జిల్లాల సుధాకర్‌రెడ్డి, మహిళ అధ్యక్షురాలు నివేదితరెడ్డి, పాలడుగు విజయ్‌కేతన్ పాల్గొన్నారు.

మొరం తవ్వకాలు అడ్డుకున్న అధికారులు


ఆందోళన చేస్తున్న స్థానికులు

- అడ్డగింతపై ఆందోళన, కేసు నమోదు

మెట్‌పల్లి: పట్టణ శివారులోని గుండుగుట్ట నుంచి అనుమతి లేకుండా మొరం తరలిస్తుండగా అక్కడకు వెళ్లి అడ్డుకోబోయిన అటవీ శాఖ అధికారులపై మొరం రవాణా చేస్తున్న వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొరం తవ్వకాల వల్ల గుట్టపై ఉన్న చెట్లు దెబ్బతింటున్నాయని అధికారులు పక్కా సమాచారంతో శనివారం రాత్రి అధికారులు అక్కడకు వెళ్లారు. తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని వారికి చెప్పగా, ఇందుకు వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని నిలిపివేస్తే తమ ఉపాధి దెబ్బతింటుందని. రవాణాను అడ్డుకోవద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేగాకుండా అక్కడే బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు ఈ విషయాన్ని పోలీసులకు తెలుపగా, ఎస్సై కిరణ్‌కుమార్ సిబ్బందితో హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. అనంతరం డిప్యూటీ రేంజ్ అధికారి అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆందోళనకారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థుల జోష్



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వాగతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ నరేశ్ మాట్లాడుతూ యువత తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని, తెలివితేటలు, ఉత్సాహాన్ని సరైన దారిలో పెట్టాలన్నారు. అప్పుడే అభివృద్ధి పథంలో వెళ్తారన్నారు. కార్యక్రమంలో గాలిపల్లి ఈశ్వర్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగిపై విజిలెన్స్ విచారణ

వెల్గటూర్: కరెంట్ మోటార్లకు కనెక్షన్లు ఇప్పిస్తానని రైతుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని జగదేవుపేటలో విధులు నిర్వర్తిస్తున్న నరేశ్ కనెక్షన్లు ఇప్పిస్తానని పెద్దమొత్తంలో దండుకున్నట్లు ఆరోపణలున్నాయి. శనివారం విజిలెన్స్ అధికారులు స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో విచారణ చేపట్టారు. విజిలెన్స్ ఎస్సై ఓంకార్, హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి, కానిస్టేబుల్స్ శ్రీకాంత్‌గౌడ్, తిరుపతి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విజయవంతం చేయాలి


ధర్మపురిలో మాట్లాడుతున్న గాజు భాస్కర్


మెట్‌పల్లిలో మాట్లాడుతున్న వడ్డెపల్లి శ్రీనివాస్

ధర్మపురి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17 న పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించన్నుట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, దివిటి శ్రీధర్, సూరజ్, స్తంభంకాడి శ్యామ్, అప్పం మల్లేశ్ తదితరులున్నారు.

సారంగాపూర్: ఈ నెల 17న బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అన్ని గ్రామాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అనుమల్ల కృష్ణహరి, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రెంటం జగదీశ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాస నాగేందర్, రాజేశ్వర్ రెడ్డి, భీమన్న, రమేశ్, అంజి, వెంకటేశ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

రాయికల్: బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే సేవా పక్షం కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా మీడియా ప్రతినిధి రాయికల్ పట్టణ ఇన్‌చార్జి భూమి రమణ అన్నారు. శనివారం రాయికల్‌లో పట్టణ, మండల కార్యకర్తల నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు ఆకుల మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 15 రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు పల్లె మోహన్‌రెడ్డి తెలిపారు. పెగడపల్లిలో శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనసూర్య, కార్యక్రమ కన్వీనర్ హరీశ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: ఈ నెల 17నుంచి అక్టోబర్ 2 వరకు చేపట్టే సేవాపక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం బూత్ అధ్యక్షులు, వార్డు ఇంచార్జీలతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి నరేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్ తదితరులున్నారు.

చర్చనీయాంశంగా పర్సన్ ఇన్‌చార్జీల నియామకం

మల్లాపూర్: మండలంలోని సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జీల నియామకం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా 23 సింగిల్ విండోలకు పర్సన్ ఇంచార్జీలను నియమిస్తూ జిల్లా సహకార అధికారి సీహెచ్.మనోజ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో మల్లాపూర్, సిరిపూర్, చిట్టాపూర్, ముత్యంపేట నాలుగు సహకార సంఘాలు ఉన్నాయి. కాగా మండలంలోని మల్లాపూర్, సిరిపూర్, చిట్టాపూర్ సహకార సంఘాల పాలకవర్గాలను రద్దు చేసి పర్సన్ ఇన్‌చార్జీలను నియమించారు. ఈ సహకార సంఘాల్లో విపక్ష(బీఆర్ఎస్) పార్టీకి చెందిన నాయకులే సింగిల్ విండో చైర్మన్లుగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముత్యంపేట సింగిల్ విండో చైర్మన్ అధికార కాంగ్రెస్ పార్టీలో చేరాడు. మండల వ్యాప్తంగా విపక్ష పార్టీలకు చెందిన పాలకవర్గాలను రద్దుచేసిన ఉన్నతాధికారులు అధికారపార్టీలో చేరిన సింగిల్ విండో చైర్మన్, పాలకవర్గాల పదవీకాలాన్ని పొడిగించడం పట్ల మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే సహకార సంఘాలకు రాజకీయాలను ఆపాదించి విపక్షాలకు చెందిన సింగిల్ విండో పాలకవర్గాలను అధికారులు రద్దు చేయడం సరికాదని, గడువు పొడిగిస్తే అన్ని సంఘాలకు పొడిగించాలని, లేనిపక్షంలో అన్ని సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జీలను నియమించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పర్సన్ ఇన్‌చార్జీల బాధ్యతలు స్వీకరణ

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఉన్నతధికారులు ప్రత్యేక అధికారిని నియమించారు. పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జ్‌గా డీసీవో కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్టర్‌గా పనిచేస్తున్న అసద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

మల్లాపూర్‌లో...

మల్లాపూర్: మల్లాపూర్, సిరిపూర్, చిట్టాపూర్ సహకార సంఘాల్లో శనివారం పర్సన్ ఇన్‌చార్జీలు బాధ్యతలు స్వీకరించారు. మల్లాపూర్‌లో జగిత్యాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎండీ.అసద్, సిరిపూర్, చిట్టాపూర్ సహకార సంఘాలకు మెట్‌పల్లి అసిస్టెంట్ రిజిస్ట్రార్ మోరపాక శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు.

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతీ ఒక్కరు సహకరించాలి

సారంగాపూర్: సారంగాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయం నుంచి మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని సారంగాపూర్ కేజీబీవీ ప్రత్యేకాధికారి వీణ అన్నారు. శనివారం మండల నాయకులు కేజీబీవీ ప్రత్యేకాధికారి, బోధన సిబ్బందితో పాటు, బోధనేతర సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోంద్ర రాంచంద్రారెడ్డి, చేకుట శేఖర్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జగిత్యాలక్రైం: కోరుట్ల మండలం యెకిన్‌పూర్ గ్రామ శివారులో రహస్య ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిపై జగిత్యాల సీసీఎస్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడిచేశారు. పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని రూ.4560 నగదు స్వాధీనం చేసుకుని పేకాట రాయుళ్లను కోరుట్ల పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సీసీఎస్ ఎస్సై రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణవేణిలో హిందీ దివస్ వేడుకలు

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం ముందస్తుగా హిందీ దివస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాష ప్రాధాన్యత గురించి విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ తిరుపతిరావు, ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ లెవల్ క్రీడలు ప్రారంభం

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం బ్లాక్ లెవల్ క్రీడలు శనివారం ప్రారంభమయ్యాయి. నెహ్రూ యువ కేంద్రం మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలకు ముఖ్యఅతిథిగా జిల్లా చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ భూమేశ్ హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో గణేశ్, ప్రోగ్రాం ఆర్గనైజర్ వినోద్, చందు, వెంకటేశ్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కోరుట్ల: పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను ఈ నెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ సందీప్, అకాడమీ కో ఆర్డినేటర్ ఏ. లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఏ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్‌లో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.విద్యార్థులు ఒరిజినల్ , జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

పెన్షనర్ల సమస్యలపై పోరాడేది టీపీసీఏనే

కోరుట్ల: పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ ముందుంటుందని రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం కోరుట్ల డివిజన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడిగా 5 వ సారి ఎన్నికైన పబ్బా శివానందం సహా కార్యవర్గాన్ని సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి గంటేడి రాజ్‌మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక గంగారాం, సలహాదారు సాంబామూర్తి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

పెగడపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటి పూర్వ వైభవం తేవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి వెంకన్న అన్నారు. మండలంలోని దీకొండలో శనివారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల అమలులో ప్రభుత్వ విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తిరుపతి, లక్ష్మీనారాయణ, భాస్కర్‌రెడ్డి, లక్ష్మన్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా గోదాం ప్రారంభం

గొల్లపల్లి: గొల్లపల్లి పీఏసీఎస్‌కు అనుబంధంగా మండలంలోని మల్లన్నపేటలో ఎరువుల గోదాంను గొల్లపల్లి ఏఎంసీ చైర్మన్ భీమా సంతోష్ శనివారం ప్రారంభించారు. మల్లన్నపేటలో ప్యాక్స్ కార్యాలయం ఏర్పాటు చేయాలని సంతోష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఇటీవల కలిసి వినతి పత్రం అందించారు. స్పందించిన మంత్రి గ్రామానికి ఎరువుల గోదాంను మంజూరు చేశారు. ఈ సందర్భంగా గోదాం ఏర్పాటుకు కృషి చేసిన మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

కోరుట్ల: నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం బిల్లుల చెల్లింపులో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువాడి కృష్ణారావు శనివారం కలెక్టర్‌ను కోరారు. కోరుట్ల పట్టణంలో ఉదయ్ బేగంకు ఇల్లు మంజూరై నిర్మాణం చేపట్టగా స్థానిక వార్డు అధికారి బిల్లు చెల్లింపుకోసం రూ. 15 వేలు లంచం తీసుకున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. విషయం బయటకు తెలియడంతో సదరు అధికారి తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేశారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి అవినీతికి తావు లేదని అలాంటి అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ప్రభుత్వ హాస్టళ్లలో మెరుగైన వసతులు

బుగ్గారం: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు బుగ్గారం ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి మహేశ్వర్ సింగ్ అన్నారు. ఈ మేరకు శనివారం వసతి గృహంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వసతిగృహంలో విద్యార్థులకు అందిస్తున్న వసతి,సౌకర్యాలు,భోజనం,ఆరోగ్య పరీక్షలు వంటి విషయాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. అలాగే విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి సలహాలు,సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో వసతి గృహ విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ శనివారం తెలిపారు. తాండ్ర్యాల గ్రామశివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు అక్కడకు వెళ్లారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

విశాఖపట్నంలో ఒగ్గు కళాకారుల ప్రదర్శన



గొల్లపల్లి: విశాఖపట్నం కళాభారతి ఆడిటోరియంలో మండలంలోని ఆత్మకూర్ ఒగ్గుడోలు కళాబృందం సభ్యులు శనివారం అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. నటరాజ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వైశాఖీ జాతీయ నృత్యోత్సవ వేడుకల్లో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ జాతీయ పురస్కార గ్రహీత డాక్టర్ చౌదరపల్లి రవికుమార్ ఒగ్గుడోలు బృందం, 21 మంది కోడె ఒగ్గుల బృందంతో విశాఖపట్నం వెళ్లి ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా వీరిని వైశాఖీ యువ పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఆర్ఎస్ఎస్ రవిశంకర్ నారాయణ, ఆదాయపు పన్నుల శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ మహమ్మద్ అలీ, నిర్వాహకులు, నటరాజ మ్యూజిక్ బాధ్యులు ఒగ్గుకళాకారులు పాల్గొన్నారు.



సారంగాపూర్: జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల మీదుగా మంచిర్యాల జన్నారం వరకు వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి ఎప్పుడు పెద్ద చిన్న వాహనాలతో రద్దీగా ఉంటుంది. సారంగాపూర్–లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్య రోడ్డును ఆనుకుని ఉన్న పెద్ద వృక్షం ఎండిపోయి రోడ్డుపై పడే ప్రమాదం ఉంది. పూర్తిగా ఎండి ఇప్పటికే మండలు విరిగి రోడ్డు వెంట వెళ్తున్న వాహనాలపై పడుతున్నాయి. అధికారులు స్పందించి ఎండిన వృక్షాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్,ఆర్అండ్‌బీ ఏఈ, కథలాపూర్, సెల్ నంబర్: 7705237843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులు


కోరుట్లలో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కోరుట్ల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. సాయుద పోరాట ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సి. ప్రభాకర్ భవన్‌లో శనివారం అరుణ పతాకం ఆవిష్కరించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పోరాటాలను కొనియాడారు. ఎంతో చరిత్ర కలిగిన సాయుధ పోరాటానికి బీజేపీ నాయకులు మతం రంగు పులుముతున్నారన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న బోజన కార్మికులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ వారోత్సవాలు

మేడిపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాలను మండలంలోని కొండాపూర్‌లో సీపీఐ మండల నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం హాజరై మాట్లాడారు. ఏ చరిత్ర లేని బీజేపీ దుష్ట రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 17న జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్ లో వారోత్సవాల ముగింపు సభ ఉంటుందని, మెట్‌పల్లి నుంచి జగిత్యాలకు బైక్ ర్యాలీ తీస్తున్నామని, ప్రతీ ఒక్కరు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

బీజేపీ మండల కార్యవర్గం నియామకం

మేడిపల్లి: భీమారం మండల బీజేపీ కార్యవర్గాన్ని నియమించినట్లు మండల అధ్యక్షుడు నాగం శివకుమార్ శనివారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా రాజకొండ వేణు, దుంపేట తిరుపతిరాజ్, బొర్రగాండ్ల గంగు, గోపు సాయిరెడ్డి. ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ రాము, కోటగిరి లింగంగౌడ్, కార్యదర్శులు గా వనపర్తి చిన్నరాజు, బొల్లె అనిల్, చెట్పల్లి రాజేష్, అనిల్ రావు, కోశాధికారిగా బద్దం జలపతిరెడ్డి, తదితరులను నియమించారు.

మండల కార్యశాలలు

మేడిపల్లి మండల అధ్యక్షుడు చిట్యాల సురేష్, భీమారం మండల అధ్యక్షుడు నాగం శివకుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి కార్యశాల కార్యక్రమాలను వేరువేరుగా ఏర్పాటు చేశారు. సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం, విమోచన దినోత్సవం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలు గురించి వివరించారు. కార్యక్రమంలో కరీంనగర్ కన్వీనర్ క్యాతం దశరథరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు ముంజ శ్రీనివాస్,పాల్గొన్నారు.

కురుమ సంఘం పట్టణ కార్యవర్గం..

మెట్‌పల్లి: పట్టణ కురుమ సంఘ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోరే రమేష్, ప్రధాన కార్యదర్శిగా కోట సురేశ్, కార్యదర్శిగా కోరే మధు, కోశాధికారిగా కోట కుమార్, కార్యవర్గ సభ్యులుగా సిరా మల్లేశం, ముద్దుల చంద్రశేఖర్, కోట ప్రభాత్,మల్లేశ్‌ను ఎన్నుకున్నారు.

యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కో–ఆర్డినేటర్‌గా శివ

రాయికల్: యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కో–ఆర్డినేటర్‌గా రాయికల్ పట్టణానికి బొద్దుల శివకుమార్ నియామకమయ్యారు. జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయభాను, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం నియామక పత్రం అందుకున్నారు.

సంఘమిత్ర మహిళా అధ్యక్షురాలిగా నివేదితరెడ్డి

రాయికల్: పట్టణంలోని సంఘమిత్ర శివాజీ మహిళా యూత్ కార్యవర్గంను శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎద్దండి నివేదితరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా పాతూరి కావ్యరెడ్డి, కోశాధికారిగా బోడుగం భావనరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొయ్యడి సనజరెడ్డితో పాటు, కార్యవర్గ సభ్యులుగా పాతూరి వనజరెడ్డి, జిల్లాల భాగ్యరెడ్డి, కుంబాల అక్షరరెడ్డి, నాగిరెడ్డి స్వప్నరెడ్డి, ఎద్దండి మమతరెడ్డి, ఎద్దండి సుష్మితరెడ్డి, తురగ రోజరెడ్డి, కుర్మ కవితరెడ్డి, మంజులరెడ్డి, రమరెడ్డి, మానసరెడ్డినిఎన్నుకున్నారు.

ఉపాధి హామీ ఇన్‌చార్జి ఏపీవోగా కొమురయ్య

కథలాపూర్: ఉపాధిహామీ మండల ఇన్‌చార్జి ఏపీవోగా కొమురయ్యను నియమిస్తూ డీఆర్డీవో ఉత్తర్వులు జారీ చేశారు. కథలాపూర్ ఏపీవోగా పనిచేసిన రాజేందర్ 15 రోజుల క్రితం సస్పెన్షన్‌కు గురికాగా, ఇబ్రహీంపట్నం మండల ఏపీవో కొమురయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 15న బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సోమన్‌పల్లి, హబ్సీపూర్, సంగంపల్లి గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు.

టౌన్–3 పరిధిలో...

జగిత్యాల టౌన్–3 పరిధిలోని భవానినగర్, బుడిగ జంగాల కాలనీ, అయ్యప్పగుడి, శాంతినగర్, పద్మనాయక కల్యాణ మండపం ఏరియా, కరీంనగర్ రోడ్ ఏరియా, నర్సింగాపూర్ రోడ్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఏరియాల్లో ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ కె.గంగారాం తెలిపారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి: పట్టణంలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఏ అమరేందర్ తెలిపారు.